క్లుప్తంగా

నేడు కర్నూలులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని వివిధ ప్రాంతాల్లో లైన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నందున ఈ నెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. బాబా బృందావనం, సంతోష్‌నగర్, సెంట్రల్ సెక్షన్, పవర్ హౌస్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెక్షన్‌ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

హాస్టల్‌లో పండగ భోజనం


భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు(అర్బన్): నగరంలోని నెంబర్ 1 కళాశాల బాలికల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో వినాయక చవితి పండుగ సందర్భంగా షడ్రుచుల భోజనాలను విద్యార్థినులకు వండి వడ్డించారు. ప్రతి పండుగకకు వసతి గృహ సంక్షేమాధికారిణి బీ బెన్నమ్మ ఏదో ఒక రకమైన ప్రత్యేక వంటకాలను తయారు చేయించి విద్యార్థినీలకు పెట్టడం ఆనవాయితీగా పాటిస్తోంది. అందులో భాగంగానే బుధవారం వినాయక చవితి పండుగ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థినులకు హెచ్‌డబ్ల్యూట బెన్నమ్మ స్వయంగా వంటలో పాల్గొని ఇంటి వాతావరణాన్ని మరిపించే విధంగా మంచి రుచికరమైన భక్ష్య భోజనాలను వడ్డించారు.

మద్యం విక్రయాలు నిలిపేయాలి


సీఐ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ ప్రతినిధి బృందం

కర్నూలు: జిల్లా వ్యాప్తంగా వినాయకుని ఉత్సవాలు పూర్తయ్యే వరకు మద్యం విక్రయాలు నిలిపివేయాలని ఎక్సైజ్ అధికారులకు డీవైఎఫ్ఐ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, సాయి ఉదయ్ తదితరులు గురువారం ఎక్సైజ్ ప్రధాన కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాజేంద్రప్రసాద్‌ను కలసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అల్లర్లకు, అసాంఘిక కార్యకలాపాలకు కారణమయ్యే మద్యం దుకాణాలు, బెల్టు షాపులను వినాయక ఉత్సవాలు ముగిసే వరకు మూయించాలని వినతిపత్రంలో కోరారు. నిమజ్జనం సందర్భంగా మందుబాబులు గొడవలు, అల్లర్లు తలెత్తే ప్రమాదముందన్నారు. నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరగాలంటే మద్యం విక్రయాలు నిలుపుదల చేయాలని వారు కోరారు.

వైభవంగా జైనుల శోభా యాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న జైన్‌లు

కర్నూలు కల్చరల్: జైన్ శ్వేతాంబర్ మర్తిక్ పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని జైన్ ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జైనుల 24వ తీర్థకందురు వర్ధమాన మహావీరుని జన్మవాంచన్ వేడుకలు ముగిశాయి. వేడుకలను పురస్కరించుకొని గురువారం జైన్ ఆలయం నుంచి మహావీర్ చౌక్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. వారం రోజుల వేడుకల్లో ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. జైన్‌లు ఉపవాస దీక్షలతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

చారిత్రక నవల రచనలో దిట్ట అజీజ్



కర్నూలు బుధవార పేటకు చెందిన ఎస్.అబ్దుల్ అజీజ్ ఎస్.డి.వి. అజీజ్ అనే కలం పేరుతో రచనలు చేస్తున్నారు. తన 14వ ఏటా నుంచే రచనలు చేయడం ప్రారంభించారు. 40 దశాబ్దాలకు పైగా సాహిత్య రచనలు చేస్తూ చారిత్రక విషయాలను వెలుగులోకి తెచ్చారు. స్టేజి నాటకాలు, సీరియల్స్, చారిత్రక నవలలు, పరిశోధన గ్రంథాలు, సాంఘిక నవలలు, కథా సంపుటాలు వెలువరించారు. స్టేజి నాటకాలు అమరజీవి, సంకల్పం, ది గైడ్, శిథిల శిల్పాలు, సీరియల్స్‌గా ప్రసారం అయిన రచనలు తుర్రె బాజ్‌ఖాన్, శ్రీకృష్ణ దేవరాయలు, బౌద్ధ జాతక కథలు, ఔరంగజేబు, రేడియో నాటకాలు సామ, కుంకుమ వనం, చారిత్రక నవలలు గులాం రసూల్‌ఖాన్, పాలెగాడు, తెర్నెకంటి ముట్టడి, వీరనారి, బుడ్డా వెంగళ రెడ్డి, కర్నూలు జిల్లాలో గాం. దీజీ పర్యటన, ఓబన్న, అల్లూరి సత్యనారాయణ రాజు తదితరాల్లో కన్నడ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువదించబడ్డాయి. అనేక సాహితీ సంస్థల్లో సభ్యునిగా ఉంటూ సాహితీ సేవ చేస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు, అవార్డులు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ 'హంస' పుస్కారం ప్రదానం చేసింది. అనేక చారిత్రక ఘట్టాలు వెలుగులోకి తీసుకొచ్చేందుకు పరిశోధనలు కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు.


సూర్యనారాయణస్వామి ఆలయంలో పండితుల పూజలు..


చిత్తారి గేరిలోని వినాయకున్ని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి,


వెంకటరమణ కాలనీలో శివపార్వతులతో గణేషుడు..



కలెక్టరేట్‌లో పూజల్లో పాల్గొన్న జేసీ నవ్య


కుమ్మరి గేరిలో వినాయకుడు


బుధవారపేటలో పూజలందుకుంటున్న గణపతి

ఆదినాయకా.. ప్రథమ పూజితా!

- నగరమంతా కొలువుదీరిన గణనాథులు
- గణేష్ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు


సుంకులమ్మ దేవాలయం వద్ద పూజలందుకుంటున్న లంబోదరుడు

కర్నూలు కల్చరల్: వినాయక నవ రాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వినాయక మండపాల వద్ద పూజలు, భక్తుల సందడితో సంబరాలు అంబరాన్నంటాయి. . నగరంలో పలు చోట్ల కళాత్మకంగా వినాయక విగ్రహాలు నెలకొల్పి పూజలు చేస్తున్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాలకు వెళ్లి గణనాథులని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. మండ పాల వద్ద భక్తుల దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, కేడీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి నగరంలోని వివిధ మండపాల వద్ద ఏర్పాటు చేసిన వినాయక పూజల్లో పాల్గొని అన్నదానం చేశారు. కర్నూలు మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామం వద్ద ఉన్న పరిశ్రమలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన వినాయకుని పూజల్లో రాష్ట్ర మంత్రి టీజీ భరత్, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసరావు పూజలు చేశారు. గణష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన విగ్రహానికి సమితి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల రమణ, సంఘటనా కార్యదర్శి నాగఫణి శాస్త్రి, నగర అధ్యక్షులు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి గిరిరాజ్ వర్మ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో..


కృష్ణానగర్‌లో భారీ గణనాథుడు

పరిపాలన గణపతికి ప్రత్యేక పూజలు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన పరిపాలన గణనాథుడికి జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించుకుని ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. వినాయకుని ఆశీస్సులతో జిల్లా ప్రజలు సంతోషంగా జీవించాలని కోరుకున్నట్లు చెప్పారు. అనంతరం గణేష్ ఉత్సవ సావనీర్‌ను జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ శివరాముడు, తహసీల్దార్లు శ్రీనాథ్, వెంకటేశ్వర్లు, ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు షహరాబాను, స్పోర్ట్స్ సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి, డీడీలు జగదీష్, వెంకటేశ్వర్లు, జనార్ధన్‌నాయక్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వేణుగోపాల్, గోరంట్ల రమణ, రంగస్వామి, గిరిరా జ వర్మ, నాగఫణి శాస్త్రి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కొలువుదీరిన పాత్రికేయ గణనాథుడు

కలెక్టరేట్‌లోని సమాచార శాఖ ఆవరణలో పాత్రికేయ గణనాథుడు కొలువుదీరాడు. గత సంవత్సరం నుంచి వరుసగా రెండో ఏడాది ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఇక్కడ ప్రతిరోజూ దాతల సాయంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.శ్రీనివాసులు, విద్యాసాగర్, శ్రీనాథ్‌రెడ్డి, అవినాష్, రామకృష్ణ ,గంగాధర్, కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.


సి.క్యాంప్ సెంటర్‌లో పూజలందుకుంటున్న వినాయకుడు,


రాయలసీమ యూనివర్సిటీలో


భజనలు చేస్తున్న భక్త బృందం


పాత్రికేయ గణనాథుడి వద్ద అన్నదాన కార్యక్రమం

రెవెన్యూలో ప్రక్షాళన

- నగర పాలకలో అవినీతికి చెక్ పెడుతూ కమిషనర్ చర్యలు
- ఒక ఆర్‌వో, నలుగురు ఆర్‌ఐలను తప్పించిన కమిషనర్
- పలువురికి స్థాన చలనం



కర్నూలు (టౌన్): నగరపాలకలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడంతో కమిషనర్ విశ్వనాథ్ ప్రక్షాళన చేపట్టారు. ప్రతి ఆర్‌ఐకి ముగ్గురు నుంచి నలుగురు ప్రైవేటు వ్యక్తులను నియమించుకోవడం, వారితో పన్నులు వేయడం నుంచి అన్ని రెవెన్యూ పనులకు పెయిడ్ సర్వీసులు చేయిస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే ఎక్కడి ఫైళ్లు అక్కడే ఉంటున్నాయి. పైగా ప్రైవేటు వ్యక్తులు ఏకంగా కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో కంప్యూటర్ పనులు సైతం ఆపరేట్ చేయడం గమనార్హం. దీంతో పాటు రెవెన్యూ వసూళ్ల కంటే వ్యక్తిగత వసూళ్లకు పాల్పడుతున్న ఆరోపణలు రావడంతో ఆయా విధుల నుంచి తప్పిస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ విభాగంలో రెవెన్యూ ఆఫీసర్ ఇజ్రాయిలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజు, మన్సూర్, టీ. శ్రీనివాసులు, ఖలీల్‌లను తప్పించారు. ఆర్‌వోను మేయర్ సీసీగా పరిమితం చేశారు. ఆయన స్థానంలో స్వర్ణలతను నియమించారు. పీ. భార్గవ్‌ను ఏ-1గా, ఆర్.రాజును ఏ-3గా, తిప్పన్న ఏ-2గా, జీ-2 అసిస్టెంట్‌గా సుదాగ్రేస్, జీ-3 అసిస్టెంట్‌గా ఎండీ. ఖలీల్, ఎస్. ఇస్మాయిల్‌ను ఈ-2గా బదిలీ చేశారు. ఎం. నాగార్జునను ఎఫ్ సెక్షన్ వ్యవహారాలు, జీ-1గా టీ. శ్రీనివాసులు, శివశంకర్‌ను ఎఫ్-1గా నియమించారు. కిషోర్ కుమార్ ఏ-5 క్లర్కుగా, ఏ-6గా షాకీర్ హుస్సేన్‌ను నియమించారు. టీ. అబ్దుల్ వాజిద్‌ను రెవెన్యూ ఆఫీసర్‌గా కొనసాగిస్తూ 103 నుంచి 127 పేటలు, అలాగే మద్దూరు నగర్, వినాయక్‌ఘాట్, సీ.క్యాంపు షాపింగ్ కాంప్లెక్స్, ఖానా - ఖజానా, ఇండోర్ స్టేడియం, స్కేటింగ్ కోర్టు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఎస్. మన్సూర్ బాషాను తిరిగి ఈ-1గా నియమించారు.

మొట్టమొదటిసారిగా.. ఓపీ సెక్షన్ ఏర్పాటు..

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత కమిషనర్ మొట్టమొదటిసారిగా ఓపీ సెక్షన్ ఏర్పాటు చేశారు. ఇందులో డీ. ఖాసీమ్, (ఓపీ-1) డి. నరసింహయ్య (ఓపీ-2) ఎస్. షేకున్నీసా బేగం (ఓపీ-3)లను నియమించి వీరందరికి పీజీఆర్ఎస్, టోల్ ఫ్రీ, ఏపీసీఎంఎస్ఎస్, కలెక్టరేట్, శానిటేషన్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పట్టణ పేదరిక నిర్మూలన ఫిర్యాదులు, ఆర్‌టీఐ యాక్టుల పర్యవేక్షణ ఫిర్యాదులు పరిష్కరించాల్సి ఉంటుంది. ఈ భారీ మార్పులతో రెవెన్యూ విభాగం గాడిన పడుతుందా.. లేదా అన్నది వేచి చూడాల్సిందే.

ప్రైవేటు వ్యక్తులతో దందా చేస్తే సహించేది లేదు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి. విశ్వనాథ్

'నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం పనితీరు మారాలి. ప్రైవేటు వ్యక్తులు కార్పొరేషన్‌కు వస్తున్నారు. సీట్లలో కూర్చొని పనులు చేస్తున్నారు. ఇక నుంచి అలాంటి వ్యక్తులు గేట్ బయట కూడా కనిపించకూడదు. ఎవరైనా వసూళ్ల దందాకు పాల్పడితే సహించేది లేదు' నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ హెచ్చరించారు. గురువారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో రెవెన్యూ విభాగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వివరాల ఆధారంగా ఆస్తి పన్ను మదింపును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 8 వేల దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేలంపాటలో ముందుకు రాని దుకాణాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఓ జునీద్ పాల్గొన్నారు.

ఉల్లి సాగుపై క్షేత్రస్థాయి పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, సహాయ సంచాలకులు నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తదితరులు క్షేత్రస్థాయిలో ఉల్లి సాగును పరిశీలించారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు, కోడుమూరు మండలం మాచాపురం మరో రెండు గ్రామాల్లో సాగు ఖర్చు, దిగుబడి, లభిస్తున్న ధరలు తదితర వాటిపై రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు మాట్లాడుతూ.. రైతులకు ఎంత ధర లభిస్తే ఉల్లి గిట్టుబాటు అవుతుందనే దానిపై సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించిందన్నారు. మార్కెటింగ్ శాఖ ద్వారా మార్కెట్‌లో 30 టన్నుల ఉల్లి కొనుగోలు చేసి కర్నూలు రైతుబజార్లకు 10 టన్నులు, విశాఖపట్టణానికి 10 టన్నులు, ఒంగోలు జిల్లాకు 5 టన్నులు, నెల్లూరు జిల్లాకు 5 టన్నులు సరఫరా చేసినట్లు తెలిపారు. నోలాస్, నో ప్రాఫిట్ కింద వినియోగదారులకు పంపిణీ చేస్తుందన్నారు.

నేటి నుంచి తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు తెలుగు భాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. గురువారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు తాను రచించిన పదవి మూలం ఇదం జగత్ అధి'కారము' పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. సాయంత్రం గంటలకు వ్యాసరచన పోటీల విజేతలు, ఏకపాత్రాభినయం పోటీల విజేతలు, ఇతర కళాకారులు మొత్తం 150 మందికి సన్మానం ఉంటుందన్నారు. సమావేశంలో కార్యక్రమ కన్వీనర్లు జీవీ శ్రీనివాస రెడ్డి, గాండ్ల లక్ష్మన్న, రాజారత్నం, గురుమూర్తి పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌లుగా జిల్లా వాసులు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర స్పోక్స్‌పర్సన్‌లుగా ఇద్దరు జిల్లా నాయకులకు రాష్ట్ర నాయకత్వం చోటు కల్పించింది. డాక్టర్ వినూషా రెడ్డి, కేబీఎస్‌బీ నరసింగారావులను స్పోక్స్‌పర్సన్‌లుగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ప్రకటన విడుదల చేశారు.

దామోదరం జిల్లాగా మార్చాలి


ఎస్వీకి వినతి పత్రం అందిస్తున్న సాధన సమితి నేతలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలను అందిస్తున్నట్లు సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షులు నక్కలమిట్ట శ్రీనివాసులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన పలువురి ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలను అందించామన్నారు. కార్యక్రమంలో సాధన సమితి ప్రధాన కార్యదర్శి డీ రామశేషయ్య, కన్వీనర్ జేవీ కృష్ణయ్య, గౌరవ సలహాదారు దామోదరం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిర్లా ఓపస్ పెయింట్స్ ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న కాంట్రాక్టర్ పల్లె ప్రభాకర్ రెడ్డి

కర్నూలు (టౌన్): స్థానిక బళ్లారి రోడ్‌లో ఉన్న వర్మ కాంప్లెక్స్‌లో గురువారం సప్తగిరి మార్కెటింగ్ ఆధ్వర్యంలో బిర్లా ఓపస్ పెయింట్స్ గ్యాలరీ ప్రారంభించారు. అతిథిగా హాజరైన క్లాస్ -1 కాంట్రాక్టర్ పల్లె ప్రభాకర్ రెడ్డి షోరూంను ప్రాంభించారు. ఈ సందర్భంగా సప్తగిరి మార్కెటింగ్ యజమానులు సుబ్బారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు ప్రజల ఆదరాభిమానాలతో రాయలసీమలో రెండవ ఫ్రాంచైజీ ప్రారంభించామన్నారు. దేశంలోనే అతి పెద్ద కంపెనీల్లో బిర్లా ఓపస్ పెయింటిగ్ ఒకటన్నారు. రీజనల్ మేనేజర్ సుమన్ రెడ్డి మాట్లాడుతూ.. వాటర్ ప్రూఫింగ్, లగ్జరీ క్యాటగిరిలో పెయింట్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. మొదటి సారిగా 10 శాతం ఆఫర్‌తో పెయింటింగ్ విక్రస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఓపెస్ మేనేజర్ సతీష్ జానీ, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.


దోపిడీ ముఠా గుట్టు రట్టు!


దోపిడీ ముఠా సభ్యుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: కర్నూలు శివారులోని జగన్నాథ గట్టు పైకి వెళ్లే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న ముఠా గుట్టును కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు రట్టు చేశారు. ముజఫర్ నగర్‌కు చెందిన గోర్లగుట్ట నాగేంద్రుడు, టీవీ9 కాలనీలో నివాసముంటున్న కురువ రమేష్, దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన దూదేకుల మాలిక్ బాషా ముఠాగా ఏర్పడి జగన్నాథగట్టు పరిసర ప్రాంతాలకు వెళ్లే ప్రేమికుల ఫొటోలు, వీడియోలు తీసి వారిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు లేదా విలువైన వస్తువులను తీసుకోవడం, ఇవ్వని వారిని చంపుతామని బెదిరింపులకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం ఒక అమ్మాయి తనకు తెలిసిన అబ్బాయితో ఆటోలో కర్నూలు-బెంగుళూరు జాతీయ రహదారి మీదుగా రాయలసీమ యూనివర్సిటీకి వెళ్తుండగా ముఠా సభ్యులు గుర్తించారు. మార్గమధ్యలో హ్యాంగౌట్ హోటల్ దాటిన తర్వాత ఆటోను ఆపి అందులో ఉన్న అమ్మాయి, అబ్బాయి ఫొటో తీసి 'మీ తల్లిదండ్రులకు పంపుతాం' అంటూ కత్తితో బెదిరించారు. అమ్మాయి నుంచి బంగారు గొలుసు, అబ్బాయి నుంచి ఫోన్‌పే ద్వారా రూ.2 వేలు, జేబులో రూ.వెయ్యి లాక్కుని ఉడాయించారు. తిరిగి రెండు రోజుల తర్వాత అమ్మాయికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దోపిడీ ముఠా నుంచి వచ్చిన ఫోన్ నంబర్ ఆధారంగా నిందితులు స్థానిక కైరా కేఫ్ వద్ద ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,500 నగదు, బంగారు చైన్, మూడు మొబైల్ ఫోన్లు, ఒక కారు, స్కూటీ, కత్తితో పాటు 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు నాలుగో పట్టణ సీఐ విక్రమసింహా తెలిపారు. పట్టణ శివారులో ప్రేమ జంటలు, స్త్రీ పురుషులు కాని ఏకాంతంగా గడపటం కోసం వెళ్లి ఇలాంటి వారి బారిన పడి ఇబ్బందులకు గురికావద్దని సూచించారు. ఎవరైనా అలా బెదిరింపులకు పాల్పడితే డయల్ 112 లేదా 9121101062కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

జన భాషకు దివిటీ.. గిడుగు

- వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు
- నేడు మాతృభాషా దినోత్సవం
- వివిధ రచనలతో మాతృ భాషాభివృద్ధికి పలువురు కృషి



కర్నూలు కల్చరల్: ప్రపంచంలో ఎన్నో భాషలున్నా తెలుగుకు ప్రత్యేక స్థానం ఉంది. తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చిన మహనీయుడు గిడుగు. ఆయన జయంతిని పుస్కరించుకొని ఆగస్టు 29వ తేదీన 'తెలుగు భాషా దినోత్సవం'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తెలుగు సాహిత్యంలో పద్యం, నవల, కథ, బాలల కథ, కవిత్వం లాంటి వివిధ ప్రక్రియల ద్వారా జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు రచనలు చేస్తూ విశేష ప్రతిభ కనబరుస్తూ సాహితీ సేవ చేస్తున్నారు. వారిలో కొందరి గురించి తెలుసుకుందాం.

కవిత్వంలో 'రాణి'.. లీలావతి



కర్నూలు నగరానికి చెందిన బి.రాణీలీలావతి ఉండల్లిలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వృత్తి ఉపాధ్యాయురాలు. ప్రవృత్తిగా సాహిత్య రంగంలో రాణిస్తున్నారు. సమకాలీన పరిస్థితులపై అనేక వచన కవితలు రాస్తూ చైతన్య పరుస్తున్నారు. వందల సంఖ్యలో వచన కవితలు రాశారు. కలల మీన, బాల గేయాలు, బాలల కథలు, మిని కవితలు, నానీలు, నానోలు, చిట్టి కథలు, వ్యంజకాలు, రుబాయిలు, మొగ్గలు తదితర ప్రక్రియల్లో రచనలు చేశారు. కర్నూలు కవిత, బాలల మొగ్గలు, బతుకమ్మ మొగ్గలు, గాంధీ మొగ్గలు ప్రచురితమయ్యాయి. సాహితీ ఉపన్యాసాలు, కవితా పఠనంలో రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్నారు. తన కవితలు, రచనలు, ఉపన్యాసాల ద్వారా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె చెబుతున్నారు.

కథా రచన ఉద్దండుడు వెంకట కృష్ణ



సహకార శాఖలో జిల్లా అధికారి వెంకటకృష్ణ. ఈయన ప్రవృత్తి సాహిత్య రచన. వేల సంఖ్యలో వాస్తవిక సమకాలీన అంశాలతో కథలు రాసిన చైతన్య మూర్తి ఈయన. కవిగా, కథకుడిగా, విమర్శకుడిగా సుప్రసిద్ధుడు. విమర్శలో తన దైన శైలిలో స్పందించే విమర్శకుడు. రాయలసీమ జిల్లాల్లో సీమ కన్నీటి గాథలను బహుజనుల అవమానాలు, చీత్కార గాథలను రచించి బహుజన రచయితగా గుర్తింపు పొందారు. కథా సంపుటాలు గరుడ స్తంభం, చిలుకలు వాలిన చెట్టు, దేవరగట్టు, కవితా సంపుటాలు లోగొంతుక, దున్నే కొద్దీ దుఃఖం, కొన్ని రంగులు ఒక పద్యం, చినుకుదీవి, దీర్ఘ కవితులు నదీవరదామనిషి, హంద్రీగానం వెలువరించారు. దేవర గట్టు కథా సంకలనానికి తెలుగు యూనివర్సిటీ ఉత్తమ కళా సంపుటి పురస్కారం ప్రదానం చేసింది. 'మాతృభాషను పరిరక్షించుకోవడం మనందరి కర్తవ్యం. తెలుగు వెలుగులు విరజిమ్మాలి. ఆ దిశగా కృషి చేయాలని వెంకట కృష్ణ అన్నారు.

కొనసాగుతున్న ఎంబీబీఎస్ అడ్మిషన్లు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. మంగళవారం 16 మంది అడ్మిషన్ తీసుకోగా, సెలవు రోజైన బుధవారం 10 మంది, గురువారం అధికంగా 110 మంది అడ్మిషన్ తీసుకున్నారు. మొదటి విడత అడ్మిషన్లకు శుక్రవారం చివరి తేదీ కావడంతో మరింత ఎక్కువగా అడ్మిషన్లు జరిగే అవకాశమున్నట్లు కళాశాల వర్గాలు తెలిపాయి.